క్లుప్తంగా

‘ఉపాధి’ పనుల పరిశీలన

మదనాపురం: మండలంలోని రామన్‌పాడులో చేస్తున్న ఉపాధి పనులను ఎంపీడీఓ చెన్నమ్మ, ఎంపీఓ పుష్పలత పరిశీలించారు. కూలీలు వడ దెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పనులు సత్వరమే పూర్తి చేయాలన్నారు.

సంస్మరణసభ విజయవంతం చేయాలి

పెబ్బేర్‌రూరల్: జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించే కామ్రేడ్ రాములు సంస్కరణ సభకు సీపీఎం పార్టీ నాయకులు, సభ్యులు, కార్యకర్తలు, ప్రజా సంఘాల నాయకులు, సానుభూతిపరులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సీపీఎం పార్టీ కార్యదర్శి జబ్బార్, కార్యవర్గ సభ్యులు పుట్టా ఆంజనేయుడు గురువారం ప్రకటనలో కోరారు. సభకు ముఖ్య అతిథిగా పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు వెంకట్ పాల్గొంటారని వారు పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

పెబ్బేర్‌రూరల్: మండలంలోని తోమలపల్లికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు కృపాకర్ రెడ్డి పెద్దమ్మ రామేశ్వరమ్మ మరణించిన విషయం తెలుసుకుని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో విజయ్‌భాస్కర్‌రెడ్డి, వెంకట్రాములుయాదవ్, సహదేవుడు, కృపాకర్ రెడ్డి, సత్యానారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వనపర్తిటౌన్: జిల్లా కేంద్రంలోని 19వ వార్డులో నరసమ్మ, 8వ వార్డులో ఆర్టీసీ డ్రైవర్ శంషు గురువారం మృతి చెందారు. స్థానిక కౌన్సిలర్లు చంద్రకళ, విభూది నారాయణ, జయనందం కుటుంబాలను పరామర్శించారు. వారి వెంట నాయకులు సతీష్, చందర్, రవి యాదవ్, కృష్ణబాబు, కళానందం, చంద్రమౌళి ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

పెబ్బేర్‌రూరల్: మండలంలోని జానంపేటకు చెందిన కొత్తకాపు కావ్యకు మంజూరైన రూ.18 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును వారి కుటుంబ సభ్యులకు గురువారం కాంగ్రెస్ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో రాజశేఖర్‌రెడ్డి, చిన్నాగౌడు, కుర్మన్న, ఆశన్న, శ్యామ్‌సుందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

18 వరకు తలంబ్రాల బుక్‌కు అవకాశం

వనపర్తిటౌన్: వనపర్తి డిపో లాజిస్టిక్స్ ద్వారా భద్రాచలం నుంచి భద్రాద్రి సీతారామచంద్ర స్వామి కల్యాణ తలంబ్రాలు భక్తులకు అందజేయనున్నట్లు డిపో మేనేజర్ వేణుగోపాల్ గురువారం ప్రకటనలో తెలిపారు. 18వ తేదీ లోపు రూ.151 చెల్లించి డిపో, బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన లాజిస్టిక్స్ కౌంటర్‌లో వివరాలు నమోదు చేసుకుని రసీదులు తీసుకోవాలని తెలిపారు. భక్తులకు కల్యాణోత్సవం అనంతరం తలంబ్రాలను అందజేస్తామని పేర్కొన్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు



ఆత్మకూర్: మండలంలోని బాలకిష్టాపూర్‌లో సారా తయారీ కేంద్రాలపై దాడిచేసినట్లు ఎక్సైజ్ సీఐ రమేష్‌రెడ్డి, ఎస్ఐ కృష్ణకాంత్ తెలిపారు. గురువారం గ్రామంలో భారీగా సారా తయారు చేస్తున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి దాడులు చేశారు. వంద లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేయడంతో పాటు, 60 కేజీల బెల్లం స్వాధీనం చేసుకున్నారు. ఆత్మకూర్‌లో సారా విక్రయిస్తున్న నారమ్మను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

రేపు నియోజకవర్గ స్థాయి సమావేశం



కొల్లాపూర్: పార్లమెంట్ ఎన్నికలు పురస్కరించుకొని ఈనెల 6న పట్టణంలో నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహిస్తునట్లు మార్కెట్ మాజీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ కాటం జంబులయ్య పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎస్ఎం గార్డెన్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డిలు హాజరవుతారని తెలిపారు. మండల అధ్యక్షుడు రాంచందర్‌యాదవ్, నాయకులు కట్టా శ్రీనివాసులు, బ్రహ్మయ్య, కలమూరి నిరంజన్, శంకర్‌నాయక్, భాస్కర్‌గౌడ్, హరికృష్ణ, మామిళ్లపల్లి శ్రీనివాసులు తదితరులున్నారు.

వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



దావాజిపల్లిలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు



ఖిల్లాఘనపురంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

పాన్‌గల్: కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సింగిల్ విండో సీఈఓ భాస్కర్‌గౌడ్ అన్నారు. గురువారం మండలంలోని దావాజిపల్లి, దొండాయిపల్లి, మాందాపూర్, అన్నారంలో సింగిల్ విండో ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. రైతులు తమ ధాన్యాన్ని ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించి నష్టపోకుండా ప్రభుత్వ కేంద్రాలలోనే విక్రయించాలన్నారు. కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులు ఏర్పాటు చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో విండో సిబ్బంది మాధవరావు, రాఘవేందర్‌రెడ్డి, అమీర్ బాబా, సహదేవ్ రైతులు పాల్గొన్నారు.

వీపనగండ్ల: మండలంలోని కల్వరాల్ల, పుల్గర్‌చర్ల, రంగవరం, గోవర్ధనగిరి, గోపాల్‌దిన్నెలో మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు శాంతమ్మ, ఏపీఎం బిచ్చన్న వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో సీసీ వీరయ్య, అకౌంటెంట్ శ్రీలత, రైతులు, పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: వరికొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సింగిల్‌విండో సీఈఓ ప్రకాష్ అన్నారు. గురువారం మండలంలోని అల్లమాయపల్లి, మల్కిమియాన్‌పల్లి, అప్పారెడ్డిపల్లి, మామిడిమాడ, పర్వతాపురం, మల్కాపురం, సోళీపురం, సూరాయపల్లి, ఖిల్లాఘనపురం, కమాలోద్దీన్‌పూర్, తిర్మలాయపల్లి గ్రామాల్లో సింగిల్‌విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరికొనుగోలు కేంద్రాలను ఆయన రైతులతో కలిసి ప్రారంభించారు. ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2203, బీ గ్రేడ్ ధాన్యానికి రూ.2183 మద్దతు ధరను ప్రభుత్వం ప్రకటించిందన్నారు. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టుకుని చెత్త, మట్టి లేకుండా చూసుకోవాలన్నారు. ధాన్యాన్ని విక్రయించే సమయంలో ముందుగానే పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంక్ ఖాతా, ఆధార్‌కార్డు జిరాక్సులతో పాటుగా ఏఈఓల ధ్రువీకరణ పత్రాలు తీసుకరావాలన్నారు.

వైభవంగా ప్రతిష్ఠాపన మహోత్సవం



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు



ప్రతిష్ఠించిన విగ్రహాలు

కొత్తకోట రూరల్: మండలంలోని కనిమెట్టలో 200ఏళ్ల కిందటి నుంచి స్వయంభూ వేంకటేశ్వరుడు (గుండు)కు గ్రామస్తులు పూజలు చేస్తుండేవారు. ఐదేళ్ల క్రితం గ్రామస్తులందరూ చందాలు పోగు చేసి ఆలయాన్ని నిర్మించుకున్నారు. ఆలయంలో విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు మూడు రోజులుగా విగ్రహాలకు వేద పండితులచే ప్రత్యేక పూజలు నిర్వహించి, గ్రామంలోని ప్రధాన వీధుల గుండా బాజా భజంత్రీలతో ఊరేగింపు చేశారు. గురువారం ఉదయం 7:45గంటలకు విగ్రహాలను ప్రతిష్ఠించారు. అనంతరం కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

భక్తిశ్రద్ధలతో ధ్వజస్తంభ ప్రతిష్ఠ



ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న గ్రామస్తులు

పెబ్బేరు రూరల్: వనపర్తి మండలంలోని చిట్యాలలో కొత్తగా నిర్మించిన శివాలయంలో శివుడు, ఇతర దేవతా విగ్రహాలను గురువారం ఆలయంలో ప్రతిష్ఠించారు. అదేవిధంగా శివాలయం ఎదుట ధ్వజస్తంభం ప్రతిష్ఠించారు. పూర్ణాహుతి కార్యక్రమాలు వేదపండితుల మంత్రోచ్చరణ మధ్య చేశారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

ఎమ్మార్పీఎస్ నాయకుల నిరసన



నిరసన తెలుపుతున్న నాయకులు

కొత్తకోట: మాదిగలకు కాంగ్రెస్ పార్టీ అన్యాయం చేస్తుందంటూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో గురువారం కొత్తకోటచౌరస్తాలో నిరసన చేపట్టారు. జిల్లా అధ్యక్షుడు చెన్నకేశవులు మాట్లాడుతూ పార్లమెంట్ సీట్ల కేటాయింపులో కాంగ్రెస్ పార్టీ మాదిగలకు తీవ్ర అన్యాయం చేసిందని, మాలల కులస్తులతో సీఎం రేవంత్‌రెడ్డి కుమ్మక్కై తమను అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికల్లో మాదిగ సత్తా ఏంటో చూపిస్తామన్నారు. కార్యక్రమంలో కిరణ్, భరత్‌భూషణ్, మొగులన్న తదితరులు ఉన్నారు.

నిల్వ ఉంచిన రేషన్ బియ్యం పట్టివేత



కొత్తకోట రూరల్: ఓ ఇంట్లో రేషన్ బియ్యం నిల్వ ఉంచిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని రాయిణిపేటలో నక్క కుమార్ గ్రామాల్లో ప్రజల నుంచి రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి ఎక్కువ ధరకు అమ్ముకుంటూ వ్యాపారం చేస్తుండేవాడు. విశ్వసనీయ సమాచారం మేరకు తనిఖీ చేయగా 11క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని 72సంచుల్లో నిల్వ ఉంచగా సివిల్ సప్లయ్ అధికారులను పిలిపించి పరీక్షించగా రేషన్ బియ్యం అని తేలడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఇఫ్తార్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే




పెబ్బేరులో ప్రార్థన చేస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

పెబ్బేరు రూరల్: మండల కేంద్రంలోని మసీద్‌లో ముస్లింలకు ఎమ్మెల్యే తూడీ మేఘారెడ్డి ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. గురువారం సాయంత్రం మసీద్‌లో ఆయన మత పెద్దలతో కలిసి ప్రార్థనలు చేశారు. ఉపవాస దీక్షలు చేపట్టిన వారికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతం పండ్లు, స్వీట్ తినిపించారు.

ఆత్మకూర్‌లో ఇఫ్తార్ విందు

ఆత్మకూర్: ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లింలకు గురువారం రాత్రి స్థానిక నేతాజినగర్‌లోని కొండాపురం కురుమూర్తి ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మౌలాన ముక్తదీర్ ప్రపంచశాంతి కోరుతూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అలాగే మస్జిదే సయ్యదియాలో ఖతాల్‌వలీ దర్గాకమిటి ఆధ్వర్యంలో ఇఫ్తార్‌విందును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సిద్దు, చిన్న, ఉక్బాల్, ఖమర్, మక్బూల్, ఫయాజ్, భట్టిపాష తదితరులు పాల్గొన్నారు.

టమాట రైతు కుదేలు



మెట్టుపల్లిలో పొలంలోనే వదిలేసిన టమాట

మండలాలవారీగా టమాట సాగు వివరాలు	
మండలాలు	ఎకరాలు
ఆత్మకూర్	1.01
కొత్తకోట	1.0
చిన్నంబావి	4.0
వీపనగండ్ల	1.3
ఖిల్లాఘణపురం	0.2
గోపాల్‌పేట	7.10
పెద్దమందడి	1.17
రేవల్లి	1.22
వనపర్తి	6.39

- కిలో రూ.7కు పడిపోయిన ధర
- పొలంలోనే వదిలేస్తున్న రైతులు

మదనాపురం: పంటనే నమ్ముకున్న రైతన్నకు కొంత కాలంగా ఏ కాలం కలిసి రావడం లేదు. మూడున్నర ఏళ్లుగా ప్రతికూల పరిస్థితుల్లోనూ పంటలు పండక రైతులు కుదేలవుతున్నారు. సాంప్రదాయ పంటలను వేస్తే ప్రయోజనం ఉండదని వ్యవసాయ శాస్త్రవేత్తలు పదేపదే హెచ్చరించడంతో రైతులు ఈసారి వాణిజ్య పంటల వైపు మొగ్గుచూపారు. లాభాలు చూద్దామని టమాట, కూరగాయల సాగు వైపు దృష్టి సారించారు. కానీ ధర లేకపోవడంతో రైతుల ఆశలు ఆవిరయ్యాయి.

ఒక్కసారిగా పడిపోయిన ధర

సాగుతో పాటు దిగుబడి కూడా ఉండడంతో టమాట ధర ఒక్కసారిగా పడిపోయింది. గత నెల వరకు ధర ఆశాజనకంగా ఉండగా, ఈ నెల ఆరంభం నుంచే ధరలు క్రమంగా తగ్గుతూ వస్తున్నాయి. రెండు రోజులుగా మార్కెట్లో టమాట ధర పూర్తిస్థాయిలో తగ్గిపోయింది. ప్రస్తుతం హోల్‌సెల్ మార్కెట్‌లో కిలో రూ.6 నుంచి రూ.7 అమ్ముతున్నారు. పొలాల్లో టమాట తెంచడానికి ఒక్కొక్కరికి రోజుకు రూ 300 నుంచి రూ.350 చెల్లిస్తున్న నేపథ్యంలో, ఒక కూలీ రోజుకు 25 కిలోల సామర్థ్యం గల 15 బాక్సులు నింపుతున్నారు. ఒక్కో బాక్స్ మార్కెట్ తీసుకెళ్లి అమ్ముతున్న గిట్టడం లేదని వాపోతున్నారు. ఆటో ఖర్చులు, తైబజార్, సాగు వ్యయం పెరిగిందని, కనీసం విత్తనాల ఖర్చు కూడా దక్కడం లేదని రైతులు చెబుతున్నారు.

శీతల గిడ్డంగులు కరువే

ఈ ప్రాంతంలో శీతల గిడ్డంగులు ఏర్పాటు చేస్తే రైతులకు కొంత దోహదపడుతుంది. జిల్లాలో టమాట, క్యాబేజీ, కాలీఫ్లవర్, చిక్కుడు, బెండ, వంకాయ, ఆకుకూరలు తదితర ఎక్కువ పండించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఆకుకూరలు అతి సూక్ష్మ పంట కావడంతో ధర ఉన్నప్పుడు కూరగాయలు కూడా సూక్ష్మ పంటలైన వాటికి శీతల గిడ్డంగులు ఉంచితే ధర ఉన్న సమయంలో అమ్ముకునేందుకు వీలుపడుతుంది. టమాట, వంకాయ, బెండకాయ సంవత్సరంలో మూడు నుంచి నాలుగు సార్లు తప్పకుండా ధరలు పెరుగుతాయి. ఈ సమయంలో రైతుల అమ్ముకునే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

ధరలు తగ్గాయి..



గతేడాది ఆశించిన ధర లభించకపోవడంతో ఈ ఏడాది అధికారులు సూచన మేరకు టమాట పంటను సాగు చేశాం. రూ.40 వేలు పెట్టుబడి పెట్టాను. రూ. 10వేలకు అమ్ముకున్నాను. ధరలు మాత్రం నిరాశ కలిగిస్తున్నాయి. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితిలో నష్టాల్లో ఉన్నాం. వ్యవసాయం ఖర్చులు రోజు రోజుకు పెరుగుతున్నాయి. ధరలు మాత్రం తగ్గుతున్నాయి.

– గోపాల్, టమాట రైతు, మెట్టుపల్లి

దయనీయ స్థితి..



సాగుబడిలో నెలకొన్న ప్రతికూల పరిస్థితుల్లో తాము దయనీయస్థితిలో చేరుకున్నాం. రెండు ఎకరాల్లో టమాట సాగు చేశాను. పెట్టుబడి రూ 1.60 లక్షలు పెట్టాను. పెట్టుబడి రాలేదు. ఏటా నష్టాల పాలవుతున్నాము. ప్రత్యామ్నాయ పంటల సాగు చేసినా ప్రయోజనం లేకుండాపోతుంది. టమాటా ధరలు తగ్గడంతో ఆందోళనలో ఉన్నాం.

– బాలరాజు, రైతు, వనపర్తి

గ్రామాల్లో తాగునీటి సమస్య రావొద్దు



మాట్లాడుతున్న అధికారులు

మదనాపురం: మండలంలోని అన్ని గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శులకు మండల ప్రత్యేక అధికారి మల్లికార్జున్ సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులతో ఎంపీడీఓ చెన్నమ్మ అధ్యక్షత తన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎట్టి పరిస్థితిలోనూ మంచినీటి సమస్య రాకుండా చూడాలని బోర్లు, భూగర్భ జలాలు తగ్గిన చోట ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయాలన్నారు. విధులపై నిర్లక్ష్యం వహించవద్దని కార్యదర్శులకు సూచించారు. గ్రామాల్లో కలుషితనీరు రాకుండా చూడాల్సిన బాధ్యత కార్యదర్శులపై ఉందని డాక్టర్ భవాని చెప్పారు. కలుషిత నీరు తాగడం వల్ల అంటురోగాలు వచ్చే ప్రమాదం ఉందని, దీన్ని గుర్తించి ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచి నీటిని అందించాలన్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలి



ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న ఆశా కార్యకర్తలు, ఉపాధి సిబ్బంది

పాన్‌గల్: ఎండలు తీవ్రంగా ఉండటంతో వడదెబ్బ తగిలే ప్రమాదం ఉందని, ప్రతి ఒక్కరు జాగ్రత్తలు పాటించాలని ఉపాధి కూలీలకు ఆశ కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శి పరశురాం అవగాహన కల్పించారు. గురువారం మండలంలోని కేతేపల్లిలో ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్ బీరయ్య, ఆశా కార్యకర్తలు ప్రమీల, కవిత, సంధ్య, చిన్నమ్మ ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రవర్తన నియమావళిపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

వీపనగండ్ల: పార్లమెంట్ ఎన్నికల ప్రవర్తన నియమావళిపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని అధికారులు తెలిపారు. గురువారం కల్వరాల్లలో అధికారులు యువకులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఓటు హక్కు వినియోగంతోపాటు ఎన్నికల సమయంలో జరిగే తప్పొప్పులను, అనుసరించాల్సిన పద్ధతులపై వివరించారు. కార్యక్రమంలో కార్యదర్శి కురుమయ్య, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఓటును సద్వినియోగం చేసుకోవాలి



కూలీలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

పెబ్బేర్ రూరల్: ప్రజాస్వామ్య ప్రభుత్వం రావాలంటే తమ ఓటును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మహిళా సాధికారత మిషన్ కోఆర్డినేటర్ భాస్కర్ అన్నారు. గురువారం మండలంలోని అంకూరులో ఉపాధి హామీ కూలీలకు స్వీప్ కార్యక్రమం నిర్వహించి ఓటు ప్రాధాన్యతను వివరించారు. ఓటు వేసేటప్పుడు జాతి, మతం, కులం, వర్గం, భాష లాంటి వాటికి ప్రభావితం కావద్దన్నారు. నిజాయితీతో మంచి వ్యక్తులను ఎన్నుకోవాలన్నారు. ఓటు హక్కుపై ఎలాంటి సందేహాలు ఉన్న టోల్‌ఫ్రీ నంబర్ 1950కు ఫోన్ చేసి నివృత్తి చేసుకోవాలన్నారు. అనంతరం ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జెండర్ స్పెషలిస్టులు శ్రీవాణి, సలోమి, కూలీలు పాల్గొన్నారు.

బీజేవైఎం అధికార ప్రతినిధిగా మధు



మధుయాదవ్‌ను సన్మానిస్తున్న జిల్లా అధ్యక్షుడు నారాయణ

వనపర్తిటౌన్: బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధిగా మధుయాదవ్‌ను రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్ నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయనను జిల్లా అధ్యక్షుడు నారాయణ శాలువాతో ఘనంగా సన్మానించారు. అధికారిక ప్రతినిధిగా తనను నియమించినందుకు రాష్ట్ర అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రామ్‌మోహన్, కుమారస్వామి, రాజశేఖర్, అరవింద్, రాజు పాల్గొన్నారు.

లబ్ధి పొందినవారు కమలంకే ఓటెయ్యాలి

కేంద్ర ప్రభుత్వ పథకాలకు లబ్ధి పొందిన వారు బీజేపీకే ఓటెయ్యాలని పట్టణ అధ్యక్షుడు బచ్చు రాము కోరారు. గురువారం జిల్లా కేంద్రంలోని 33వ వార్డు వల్లభ్‌నగర్‌లో ఇంటింటి ప్రచారం చేపట్టారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి భరత్‌కు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

సభ విజయవంతం చేయాలి



వాల్ పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

ఖిల్లాఘనపురం: పూలే, అంబేద్కర్ ఆశయాల అమలు కోసం 14న నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం మంగనూరులో నిర్వహించే సభను విజయవంతం చేయాలని దళిత, బహుజన సంఘాల నాయకులు శ్రీనివాసులు, చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. గురువారం సభకు సంబందించిన వాల్‌పోస్టర్లను మండల కేంద్రంలోని తెలంగాణచౌరస్తా వద్ద విడుదల చేశారు. వారు మాట్లాడుతూ సభకు ఉస్మానియా యూనివర్సిటీ ప్రొ.కాసిం హాజరవుతారని చెప్పారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి దళిత బహుజనులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో గోవింద్, వెంకటస్వామి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రతకు షీటీమ్స్



విద్యార్థులకు బ్యాడ్జీలు, సర్టిఫికెట్లు అందిస్తున్న ఎస్ఐ

పెబ్బేరు రూరల్: మహిళల భద్రతకు షీటీమ్స్ భరోసా అని ఎస్ఐ అంజద్ అన్నారు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహిళలు, విద్యార్థినులు ఆపద సమయంలో షీటీమ్స్ నంబర్ 6303923211 ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. మహిళలు, బాలికలపై ఆన్‌లైన్ అసభ్యకర పోస్టులు పెట్టే సైబర్ నేరగాళ్ల పై కూడా ఫిర్యాదు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రైస్‌ఫాతిమా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బెల్లం అమ్మకాలకు అనుమతివ్వండి



ఆత్మకూర్‌లో ఎక్సైజ్ అధికారులతో మాట్లాడుతున్న నాయకులు

ఆత్మకూర్: ఉగాది, రంజాన్ పండుగల నేపథ్యంలో బెల్లం అమ్మకాలను అనుమతులు ఇవ్వాలని టీపీసీసీ అధికారప్రతినిధి నాగరాజుగౌడ్ కోరారు. గురువారం స్థానిక ఎక్సైజ్ శాఖ కార్యాలయం వద్ద పట్టణ వర్తక సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఎక్సైజ్ సీఐ రమేష్‌రెడ్డి, ఎస్ఐ కృష్ణకాంత్‌లతో మాట్లాడారు. పండుగల సందర్భంగా తీపి వంటకాల్లో బెల్లంను తప్పనిసరిగా వాడుతారని గుర్తు చేశారు. బెల్లం అమ్మకాలను అనుమతులు ఇవ్వడంతోపాటు వ్యాపారులపై వేధింపులను ఆపాలని కోరారు. ఆధార్‌కార్డు ఆధారంగా ఒక్కరికి ఒక కేజీబెల్లం చొప్పున ఇచ్చేవిధంగా చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇవ్వడంతో వ్యాపారులు శాంతించారు. కార్యక్రమంలో అయ్యూబ్‌ఖాన్, రహ్మతుల్లా, పరమేష్, తులసీరాజ్, శ్రీనివాసలు, నాగేష్, రఫీ, యాదగిరి శెట్టి, షాకీర్, నాయకులు ఉన్నారు.